క్లుప్తంగా

ఎయిడ్స్ నివారణపై అవగాహన



ఎయిడ్స్ నివారణపై అవగాహన ర్యాలీ

వెంకటగిరి రూరల్: పట్టణంలోని అరవపాళెంలో మంగళవారం నవజీవన్ ఆర్గనైజేషన్, సీసీ పీయూ ప్రాజెక్టు ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్ నివారణపై మీకు తెలుసా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆ ప్రాంతంలో ఎయిడ్స్, క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ఓఆర్ డబ్ల్యూ కవిత, ఏఎన్ఎం హరిత మాట్లాడుతూ ప్రజలు వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. హెచ్ఐవీ ఎయిడ్స్ సోకకుండా ఉండేలా తగు నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సిబ్బంది శిరీష, కల్పన, నళిని తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ



పబ్లిక్ సిస్టమ్‌ను పాఠశాలకు అందిస్తున్న దాత సుందరరాజా తదితరులు

చిల్లకూరు: మండలంలోని చింతవరం గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలకు మంగళవారం దాతల సహకారంతో మైక్‌సెట్‌ను అందజేశారు. వితరణగా అందించారు. చింతవరం ఎంపీటీసీ పాలూరు మాధవి, గ్రామ సర్పంచ్ జోగి సుగుణమ్మల చేతులమీదుగా మైక్‌సెట్‌ను పాఠశాలకు అందించారు. వారు మాట్లాడుతూ రూ.20 వేల విలువ చేసే పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌ను గ్రామానికి చెందిన శనగపల్లి సుందరరాజా అందించారని అన్నారు. దాత సుందరరాజాను ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. పాఠశాల హెచ్ఎం శివసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకారం



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు రూరల్: గ్రామాల్లో నిలిచిపోయిన అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ బూదూరు గురవయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. పలువురు తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఊటుకూరు యామిని, వైస్ ఎంపీపీ ఇంద్రాణి, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను ఆదరించాలి



ఇన్వర్టర్‌ను అందిస్తున్న క్లబ్ ప్రతినిధులు

గూడూరు రూరల్: ప్రతి కుటుంబంలో పెద్దలుగా ఉన్న తల్లిదండ్రులను వారి బిడ్డలు బాగా చూసుకుంటే దేశంలో వృద్ధాశ్రమాలు ఉండవని వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని చార్టెడ్ అకౌంటెంట్ శ్రీకంఠి రామోహన్‌రావు దాతృత్వంతో రోటరీ వెస్ట్ క్లబ్ వారు శ్రీసాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమానికి ఇన్వర్టర్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న వారికి ఎలాంటి అవసరాలు ఉన్నాయో కుటుంబ సభ్యులు గుర్తించి వారికి అందుబాటులో ఉండేలా చేయాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు నాశిన నాగులు , గిరిబాబు, ధనుంజయరెడ్డి, సనత్‌కుమార్, బిమ్మిడి శ్రీనివాసులు, బలరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

గూడూరు రూరల్: విందూరు ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను రూరల్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. పోలీసులు ఇసుక అక్రమంగా తరలించే వారిపై నిఘా పెట్టి గ్రామీణ ప్రాంత రహదారులపై దృష్టి పెట్టారు. దీంతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.

విజ్ఞానగిరి పనులు పూర్తి చేయండి

శ్రీకాళహస్తి: విజ్ఞానగిరి ఆధునికీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు కోరారు. మంగళవారం ఆయన విజ్ఞానగిరిపై జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.

ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వహించే మహిళా వైద్య సిబ్బంది కోసం ప్రత్యేక చర్యలతోపాటు రక్షణ కోసం జాగ్రత్తలు చేపట్టాలి. అదే విధంగా రహదారి వెంబడే ఉన్న ఆస్పత్రుల్లో రాత్రిళ్లు విధులు నిర్వహించే ఏఎన్ఎం, స్టాఫ్‌నర్సుల కోసం పోలీస్ పహారా సైతం ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలి. అప్పుడే వైద్య సిబ్బంది ఎలాంటి భయాందోళనలకు లోనుకాకుండా విధులు నిర్వహిస్తారు.

- డాక్టర్ వి.చైతన్య, వైద్యాధికారి, దొరవారిసత్రం పీహెచ్‌సీ



సీసీ కెమెరాలు తప్పనిసరి



గతంలో వైద్య రంగంలో స్త్రీలు చాలా తక్కువగా ఉండేవారు. కానీ ఇప్పుడు వారి సంఖ్య మగవారి కంటే అధికమైంది. ప్రస్తుతం వైద్యుల్లో 60 నుంచి 70 శాతం స్త్రీలు ఉంటున్నారు. రాత్రివేళల్లో వారు డ్యూటీ చేసే సమయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోకపోతే దాడులు జరిగే అవకాశం ఉంది. మళ్లీ కోల్‌కతా సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే పటిష్టమైన విధివిధానాలు అమలు చేయాలి. పీజీ డాక్టర్లకు పనిగంటలు ఎక్కువగా ఉంటున్నాయి. దీనిని సమీక్షించాలి. ప్రభుత్వ ఆసుపత్రిలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. **- డాక్టర్ శ్రీధర్, గిద్దలూరు పీహెచ్‌సీ, సైదాపురం**

బురదమడుగు చెరువులో ఆక్రమిత భూముల్లో త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్



తనియాలి గ్రామంలోని చెరువు పోరంబోకు భూమి ఆక్రమణ



చెరువులనే మింగేశారు

- యథేచ్ఛగా చెరువుల ఆక్రమణ
- సాగు భూములుగా మార్పు
- విద్యుత్ సౌకర్యం కూడా ఏర్పాటు చేసుకుంటున్న భూస్వాములు

దొరవారిసత్రం: మండలం పరిధిలోని పలు గ్రామాల్లో ఉన్న పీడబ్ల్యూడీ, పీఆర్ శాఖ పరిధిలోని చెరువులు సాగు భూములుగా మారడంతో స్వరూపాలే కోల్పోతున్నాయి. ఈ ఆక్రమణలపై ఆయా ప్రాంతాల్లోని రైతులు, గ్రామస్తులు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఏమి పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందులో ముఖ్యంగా బురదమడుగు, తల్లంపాడు, వేణుంబాకం, లింగంపాడు, నెల్లూరుపల్లి, చందనముడి, తనియాలి, శ్రీధనమల్లి, బూదూరు, ఉచ్చూరు, కొత్తపల్లి తదితర గ్రామాల్లోని చెరువు పోరంబోకు భూములను ఆయా ప్రాంతాల్లోని భూస్వాములే భారీగా ఆక్రమించి సాగు భూమిగా తీర్చేశారు. ఈ ఆక్రమణలు అడ్డుకునే విషయంపై ఇటు రెవెన్యూ అధికారులు, అటు ఇరిగేషన్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఇప్పటికే వివిధ చెరువుల పరిధిలోని పోరంబోకు భూములు 200 ఎకరాల వరకు ఆక్రమణకు గురయ్యాయి. ఇందులో అత్యధికంగా బురదమడుగు, వేణుంబాకం, బూదూరు గ్రామాల్లోని చెరువు పోరంబోకు భూములు పూర్తి స్థాయిలో ఆక్రమణకు గురయ్యాయి.

ఆక్రమిత భూముల్లోకి విద్యుత్

బురదమడుగు, బూదూరు, తనియాలి తదితర గ్రామాల్లోని చెరువు పోరంబోకు భూములు ఆక్రమణలు ఒక ఎత్తైతే మరో పక్క ఈ ఆక్రమిత భూముల్లోనే బోర్ పాయింట్లు వేసుకోగా వాటికి విద్యుత్ శాఖ అధికారులు త్రీఫేజ్ విద్యుత్ సదుపాయం కల్పించడం విశేషం. దీంతో ఆక్రమణదారులు విద్యుత్ మోటార్లు పెట్టుకుని ఆక్రమిత భూములను దర్జాగా సాగు చేసుకుంటున్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

రాపూరు: ప్రభుత్వ వైద్యశాలలో సెప్టెంబర్ 2న నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వ వైద్యురాలు నర్మదాదేవి ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ వైద్యశాల్లో రక్తం నిల్వ చేస్తున్నట్లు తెలిపారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రక్తం ఇచ్చే యువకులు, దాతలు ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

గురుకులంలో వైద్య శిబిరం

వాకాడు: మండల కేంద్రమైన వాకాడు అంబేడ్కర్ గురుకులంలో మంగళవారం బాలిరెడ్డిపాళెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దీప్తి పాల్గొని, విద్యార్థులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. డాక్టర్ దీప్తి మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణం ప్రతికూలంగా ఉన్నందున విద్యార్థులకు తగిన వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. అనంతరం విద్యార్థులకు ముందస్తు జాగ్రత్తగా టీడీ వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం



సమీక్షా సమావేశంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం): పట్టణంలోని నేదురుమల్లి నివాసంలో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మంగళవారం కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. ఈ మేరకు ప్రతి కార్యకర్తలకు అండగా ఉండేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలియజేశారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో వైఎస్సార్ సీపీ నేతలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు.

ఈ కార్యక్రమంలో వెంకటగిరి, డక్కిలి జేసీఎస్ కన్వీనర్లు ఎం.వెంకటేశ్వర్లు, చింతల శ్రీనివాసులురెడ్డి, నేతలు సదారెడ్డి, రాజారెడ్డి, ప్రభాకర్, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

గూడూరు రూరల్: పట్టణంలోని నమాజ్ కట్ట ప్రాంతంలో ఓ వ్యక్తి మంగళవారం కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నమాజ్‌కట్ట ప్రాంతానికి చెందిన శ్రీకాంత్(33) అనే వ్యక్తి ఎలక్ట్రీషియన్‌గా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో కుటుంబంలో చిన్న సమస్యలు రావడంతో కలహాలు ఏర్పడ్డాయి. దీనిపై మనస్తాపం చెందిన శ్రీకాంత్ ఇంటిలో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యాను హుక్కుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. ఈ మేరకు ఒకటో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, ఒక చిన్న పాప ఉంది.

కండలేరులో 6.110 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 6.110 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 1175 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. సత్యసాయి గంగ కాలువకు 120, లోలెవల్ కాలువకు 20 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వరుడికి నాయకుల ఆశీర్వాదం



వరుడిని ఆశీర్వదిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మేరిగ మురళీధర్

రాపూరు: తానంచర్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఎద్దల బాలకృష్ణారెడ్డి కుమారుడు దినేష్‌రెడ్డి నలుగు కార్యక్రమంలో మంగళవారం వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగమురళీధర్ పాల్గొన్నారు. వరుడిని ఆశీర్వదించారు. వారి వెంట వైఎస్సార్ సీపీ నాయకులు పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, పాపకన్ను దయాకర్‌రెడ్డి, పాపకన్ను వేణుగోపాల్‌రెడ్డి, దందోలు నారాయణరెడ్డి, కోటేశ్వరరెడ్డి, చెంచురామిరెడ్డి, కలపాటి మధుసూదన్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కలగుంటలో ఆక్రమణలపై విచారణ



కలగుంట ఎస్టీ కాలనీవాసులతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారి

దొరవారిసత్రం: కలగుంట గ్రామ పరిధిలోని ఎస్టీ కాలనీకి సమీపంలో ప్రభుత్వ భూముల ఆక్రమణపై స్థానిక రెవెన్యూ అధికారులు స్పందించి మంగళవారం విచారణ చేపట్టారు. సాక్షిలో ×కలగుంటలో ప్రభుత్వ భూమి ఆక్రమణ÷ అనే వార్త ప్రచురితం కావడంతో తహసీల్దార్ శైలకుమారి స్పందించారు. ఈ ఆక్రమణపై విచారణ నిమిత్తం సచివాలయం సర్వేయర్ బాలకృష్ణ, సంబంధిత వీఆర్‌ఓ రమేష్ ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి, కాలనీవాసులతో మాట్లాడారు. ప్రస్తుతం యంత్రాలతో తీరుస్తున్న భూమి అంతా సర్వే నంబరు 272లోని పట్టా భూమి అని వీఆర్‌ఓ తెలియజేశారు. ఇదే ప్రాంతంలో 271 సర్వే నంబరులో ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ ఎలాంటి ఆక్రమణకు గురికాలేదని ఆయన తెలిపారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైతే మాత్రం సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సామాజిక తనిఖీలో రూ.2.36 లక్షల రికవరీ



డక్కిలి: బిల్లులు మంజూరు కాలేదని డ్వామా పీడీకి ఫిర్యాదు చేస్తున్న భాస్కర్‌నాయుడు

డక్కిలి: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సామాజిక తనిఖీ బహిరంగ ప్రజా వేదిక నిర్వహించారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో 2023–24 సంవత్సరానికి జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి 12 మంది డీఆర్పీలు చేసిన సామాజిక తనిఖీ నివేదికను చదివి వినిపించారు. అనంతరం డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి వివిధ పనులకు సంబంధించి రూ.11 కోట్ల 4లక్షల పనులు చేపట్టినట్లు తెలిపారు. అయితే ఇందులో పలు పంచాయతీలకు సంబంధించి రూ.2.36 లక్షల నిధులు దుర్వినియోగమయ్యాయని, శాఖాపరంగా రికవరీ చేయాలని ఆదేశించామన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఒకరిద్దరు సిబ్బందిపై త్వరలో సమగ్ర విచారణ చేపడతామన్నారు. ఎంపీపీ గోను రాజశేఖర్, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఏపీడీ వరప్రసాద్, ఎస్ఆర్పీ వెంకయ్య, ఏపీఓ లక్ష్మీనారాయణ, ఈసీ దామోదర్‌రాజు పాల్గొన్నారు.

అవెన్యూ ప్లాంటేషన్ బిల్లులు ఇవ్వలేదు..

గతంలో తాను రోడ్డుకు ఇరువైపుల అవెన్యూ ప్లాంటేషన్ పథకం కింద చెట్లు పెంచినా బిల్లులు ఇవ్వడంలో ఉపాధిహామీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని డి.ఉప్పరపల్లి (గొల్లపల్లి) గ్రామానికి చెందిన సొసైటీ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు బొల్లినేని భాస్కర్ నాయుడు డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్‌కి ఫిర్యాదు చేశారు. 20221–22 సంవత్సరంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో డక్కిలి మండలం ఉన్న సమయంలో ఈ పనులకు రూ.1.42 లక్షలకు సంబంధించి ఎంబుక్‌లు చేశారన్నారు. తరువాత డక్కిలి మండలం తిరుపతి జిల్లాకు మారిన అనంతరం బిల్లులు మంజూరు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డ్వామా పీడీ స్పందిస్తూ ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారించి న్యాయం చేయాలని డ్వామా ఏపీడీ వరప్రసాద్‌ను ఆదేశించారు.

పరిశ్రమల స్థాపనతో యువతకు ఉపాధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ

పెళ్లకూరు: నూతన పరిశ్రమలు స్థాపించుకోవడంతో స్థానిక యువతీయువకులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం పాలచ్చూరు పంచాయతీ పరిధిలో బిర్లా కార్బన్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ స్థాపన(ఉత్పత్తి సామర్థ్యం 2,40,000 మెట్రిక్ టన్నులు/సంవత్సరానికి) కోసం జేసీ శుభం బన్సల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సభలో ఆమె పాల్గొన్నారు. కార్బన్ వ్యర్థాలతో వాయు కాలుష్యం కారణంగా భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేలా కాలుష్య నియంత్రణ మండలి సూచనల మేరకు తగిన జాగ్రత్తలు తీసుకుంటామని కంపెనీ ప్రతినిధులు హామీ ఇచ్చారు. బిర్లా కార్బన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పరిశ్రమ నిర్మాణం కోసం స్థానికులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ అశోక్‌కుమార్, స్థానిక తహసీల్దార్ ద్వారకనాథ్‌రెడ్డి, అడ్మిన్ హెచ్ఆర్ వరప్రసాద్, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, నాయకులు మాధవరెడ్డి, పెళ్లూరు అనిల్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, కృష్ణయ్య, శివకుమార్, ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్న దాతలు, ఉపాధ్యాయులు

చిట్టమూరు(చిల్లకూరు): పది పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందించారు. మండలంలోని ఆరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో పది పరీక్షలలో 1, 2, 3 స్థానాలలో నిలిచి వారికి మంగళవారం నగదు ప్రోత్సాహకాలను అందించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకుడు దేవారెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామానికి చెందిన కందుకూరు సురేష్‌రెడ్డి కుమారులు డాక్టర్ నిరంజన్‌కుమార్‌రెడ్డి, మోహన్‌క్రిష్ణారెడ్డి నగదు ప్రోత్సాహకాలను అందిస్తామని మాట ఇచ్చారని అన్నారు. ఈ క్రమంలోనే పది పరీక్షలలో పాఠశాలలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థి ఎం.మణికంఠకు రూ.5 వేలు, రెండో స్థానంలో నిలిచిన విద్యార్థి సీహెచ్.కిరణ్‌కుమార్‌కు రూ.3 వేలు, మూడో స్థానంలో నిలిచిన విద్యార్థిని జె.ప్రశాంతికి రూ.2 వేలు అందించారు. పాఠశాలలో పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు. హెచ్ఎం జ్యోతి, పెళ్లూరు సురేంద్రరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



సామూహిక కుంకుమార్చన పూజలు



పూజలు నిర్వహిస్తున్న యాదవ సంక్షేమ సంఘం నాయకులు

నాయుడుపేట టౌన్: శ్రీకృష్ణాష్టమి వేడుకలను రాజగోపాలపురం వీధిలోని సీతాలక్ష్మణ సమేత రామాంజనేయ స్వామి ఆలయం వద్ద మంగళవారం వైభవంగా నిర్వహించారు. యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గణపతి హోమ పూజలు నిర్వహించారు. అనంతరం వందలాది మంది మహిళలతో సామూహిక కుంకుమార్చన పూజలను వేదపండితుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో జరిపారు. మధ్యాహ్నం సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, పార్థు దంపతులు పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేను యాదవ సంక్షేమ సంఘ నాయకులు శాలువాలతో సత్కరించారు. వందలాది మందికి అన్నప్రసాదాలు అందించారు. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని కోలహలంగా నిర్వహించారు. రాత్రి నగరోత్సవాన్ని అత్యంత వేడుకగా జరిపారు. యాదవ నాయకులు భారతాల సాయిరామ్ కిషోర్, మునీంద్ర, బట్టా సుబ్రహ్మణ్యం, యాదపల్లి జనార్దన్, బాలాజీ, పాలచ్చూరు రవి, ప్రదీప్, ఓట్టూరు రాధాకిషోర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతం



సీమంతం చేస్తున్న సేవాసంస్థ ప్రతినిధులు

గూడూరు రూరల్: సునీతా సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సామూహిక సీమంతం కార్యక్రమాన్ని వారి కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరమ్మ మాట్లాడుతూ గర్భిణులకు సామూహిక సీమంతాలు చేయడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. అనంతరం కేవీ హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ నారా కీర్తి మాట్లాడుతూ గర్భవతులుగా ఉన్న వారు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. రక్త హీనత ఉన్నవారు క్రమం తప్పకుండా వైద్యుల వద్ద పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ మహబూబీ, సారంగం శ్రీనివాసులు, సంస్థ ప్రతినిధి, సులక్ష్మీ, మదనంబేటి రమణయ్య, సువర్ణలక్ష్మీ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వేదిక ఏర్పాటు చేయాలి

శ్రీకాళహస్తి: ప్రతి కల్యాణమండపంలో వాయిద్య కళాకారులకు వేదిక ఏర్పాటు చేయాలని శ్రీకాళహస్తి నాయీ బ్రాహ్మణ వాయిద్య కళాకారులు సేవా సంఘం అధ్యక్షుడు మహేంద్ర కోరారు. పట్టణంలోని పొన్నాలమ్మ ఆలయం వద్ద మంగళవారం వారు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వివాహ వేడుకలకు మంగళవాయిద్యాలు తప్పనిసరి అన్నారు. కొన్ని కల్యాణ మండపాల్లో వాటి కోసం వేదికలు ఏర్పాటు చేస్తే మరికొన్ని వేదికల్లో కనీసం కింద కూర్చోవడానికి కూడా వస్త్రం కూడా ఇవ్వడం లేదని వాపోయారు. ప్రతి కల్యాణ మండపాల నిర్వాహకులు నాయీబ్రాహ్మణులను దృష్టిలో ఉంచుకుని మంగళవాయిద్యాలకు వేదికలు ఏర్పాటు చేయాలని కోరారు.